కథానిక

# అణుశక్తి - ప్రణయము

"రాజా"

"కందకూర చెయ్యడం నీకేం చేతనవును, నా చిన్నతనంలో మా మామ్మ చేసేది చక్కగా!" అన్నాడు వెక్కిరిస్తూ కృష్ణమూర్తి.

"కృష్ణా! ఇహ కందకూర మీద కామెంట్సు చాలుగాని ఇంకేదన్నా మాట్లాడు. లేకపోతే అవతలికి వెళ్ళి న్యూస్ పేపర్ చదువుకో. ఎంచక్కా బుద్ధిమంతుడల్లే" అంది రాధ కంద దుంపను ముక్కలుచేస్తూ.

"ఆడవాళ్లు పట్టి ఈర్ష్యాణువులు."

"ఈర్ష్యాణువు లేమిటి? ఇదేం భాష? ఫిజిక్సులో అణువు లుంటాయిగాని అవి ఆడవాళ్ళ బుద్ధుల్లోకి రావడంకూడా నేర్పారేంటి?" అని పూరుకోక రాధ పకపకా నవ్వడం మొదలు పెట్టింది.

అదే ఇంకోసారైతే "అణువులు ఫిజిక్సులోనే కాదు. నువ్వు తరిగిన కందముక్క కూడా కోటాను కోట్ల అణువులచే పరివృతమైయున్నది. నీ తెలివికి మస్తుగా సంతోషిస్తిమి. తెలియని ఫిజిక్సు పేరెత్తకు. తెలిసిన లిటరేచర్ని తెప్పించు నీ ధోరణిలోకి" అనేవాడే. కాని...

కృష్ణమూర్తికి బోలెడంత సిగ్గేసింది. చిన్న తన మనిపించింది. లేకపోతే ఒక ఆడది తనంతటి వాడిని పట్టుకుని అలా అనడమే.

"జాగర్త. జాగర్త. చెయ్యి తెగిపొయ్యేను. కత్తిపీట దగ్గర్నుంచి లేచి మరీ నవ్వు." అని అనే వాడు ఇహ ఉక్రోషం పట్టలేక.

"మీ ఆడవాళ్లంత అనుమానం మనుష్యులూ, వాళ్లకున్నంత జెలసీ నిజంగా ఎవరికి వుండవు." ఈ మాటలకు అలవాటుపడ్డ రాధ మెదలకుండా కూర తరుక్కుంటోంది.

"నే చదువుకునేటప్పుడే, అంటే బి. యస్. సి. లోనే ఒక అమ్మాయి వుండేదిలే. పేరు...అ... పేరు. ఆ అమ్మాయి కళ్ళు బలే బాగుండేవిలే. ఎంచక్కా సన్నగా, పొడుగ్గా, కాటిక పెట్టినట్టుండేవి. తళుక్ తళుక్ మంటూ నీ కళ్ళకన్నా—"

"అవును మరే. ఒకసారి మీ కాలేజీ ఏదో ఫంక్షన్ అవుతోందిట. అప్పుడు లైట్లు కాస్తా పొయ్యాయిట. అప్పుడు నువ్వేమో అందరినీ గాబరాపడద్దని ఆ అమ్మాయిని తీసుకెళ్ళి స్టేజిమీద నుంచోబెట్టేసరికి పెట్రోమాక్సు లైట్లు అనుకున్నారట అందరూ. అవునా?" అంది రాధ.

"ఎగ్జాక్ట్లీ! ఎల్లా తెలిసింది నీకు? ఆ అమ్మాయి—"

"అబ్బబ్బ. చాల్లెద్దూ. రోజూ వినలేక చస్తున్నాను ఈ కోతలు."

"అదిగో. అదిగో. దాని పేరే..."

"ఏది? ఏమిటి? ఇంకొత్త పేరు కావాలా? ఏదో పేరమ్మ." విసుగ్గా అంది రాధ లోపల నవ్వుకుంటూ.

"మనుషుల పేర్లు కాదులే. ఇందాక నే చెప్పలా. జెలసీ అని. నీలో అది అందరిలోకన్నా నాలుగు రెట్లెక్కువ. ఒక్క అమ్మాయి సంగతి చెప్పనియ్యవుగదా" మరీ వుడికిద్దామనుకున్నాడు కృష్ణమూర్తి.

"ఏమిటి చెప్పనియ్యడం చెప్పనియ్యకపోడం? నే వినకపోతే గోడలకీ, అదీ కాకపోతే బొయ్యిక్కీ, అంట గిన్నెలకీ చెప్తావు. రోజూ ఒకటేగా పేర్లు కొత్తగానీ. ఏం నీఅంత అందగాడు లేడనా ప్రతి అమ్మాయి నీవెంట బడడానికి—"

"ష్‌ష్. కొట్టకు. బుజం విప్పిస్తా కమలచేతా, కాంతంచేతా, ఏమనుకున్నావో? ఒకమ్మాయి వుండేదిలే జూలియెట్ అని—"

"అబ్బబ్బ వూరుకుందూ. నువ్వో రోమియోవి దొరికావు ఆ జూలియట్కి! సంతోషించా లెద్దూ!" ఏడుపు మొహం పెట్టింది రాధ.

"ఏడవకు ఏడవకు వెర్రి రాధమ్మా. నువ్వేడిస్తే ఎల్లాగమ్మా. నాకు టైమవుతోందమ్మా... ఊఁ... ఛూ..."

కిలకిలా నవ్వింది రాధ. గట్టిగా చూసి ఘాటుగా అడిగింది. "ఈ జోల పాటలుకూడా ఎందుకు?" అని.

భయపడి పొయ్యాడు భక్తుడు. "అదిలేదు. నువ్వు...సంతోషించానన్నావుగా. మరి సంతోషించడమంటే విచారమేగా ఆడవాళ్ళకు. ఇది ఋజువుతోసహా కనుక్కున్న కొత్త సత్యమాయె మరి." బుంగమూతి పెట్టేశాడు కృష్ణమూర్తి.

• • •

భోంచేస్తూన్న కృష్ణమూర్తి హఠాత్తుగా అన్నాడు. "కమలకీ, సులోచనకీ వాళ్ళకీ లెటర్సు రాయనా?" అని.

"మీ ఊహాలోకానికి కూడా లెటర్స్ చేరుతాయేం?"

"నీకేం తెలుసులే. నువ్వు మా వూళ్ళో చదువులే తెలిసేది నా తడాఖా." మరీ మరీ కవ్విస్తున్నాడు కృష్ణమూర్తి.

"ఇల్లా అనుకునే బదులు అందులో నచ్చిందాన్నే చేసుకోక పొయ్యావూ?"

ఇన్ని రోజుల్నుంచీ లోపల వున్నది తెగించి అడిగింది రాధ.

"మరప్పుడు నిన్ను చేసుకునే వాడు దొరకక్కర్లా? ఏదో స్నేహితుడి చెల్లెలివిగదా అని చేసుకున్నా కాని!" "నేనేనేమిటి నీకన్న తెలివితక్కువవాడిని ఆ మాత్రం సమాధానం చెప్పలేనూ?" అని లోపల అనుకోబోయి పైకే అంటూ లేచాడు కృష్ణమూర్తి...

"నిజంగా కృష్ణ వీళ్ళందరికీ వుత్తరాలు రాస్తూ వుంటాడేమో. మరి పెళ్ళి కాకముందు సెలవలకి అన్నయ్యతో వస్తే అన్ని కబుర్లు ఎంతబాగా చెప్పేవాడు. అవి వినే తను మోసపోయింది. అతను చెప్పేవన్నీ నిజమే అయితే మరి అన్నయ్యకు తెలియదూ? తనతో ఎన్నడూ ఎందుకు అనలేదూ? ఏమో తనతో చెప్పినట్టే ఎన్ని కబుర్లు ఎందరితో చెప్పేవాడో" రాధ ఇల్లాగే ఆలోచిస్తూ కూర్చుంది. ఎల్లాగైతేనేం సాయంకాలం కాగానే కృష్ణమూర్తి వచ్చాడు. అతను రాగానే చెప్పి పుట్టింటికి ప్రయాణం కట్టింది. లోపల నవ్వుకుంటూ సాగనంపాడు రాధను...

"అన్నయ్యా! కృష్ణకు, ఏ అమ్మాయిలతోనన్నా స్నేహముందా?" అన్నయ్యను ముందర అడగాలనుకున్న ప్రశ్న.

కానీ అక్కడికి వెళ్ళేటప్పటికి, అన్నయ్య ముఖం చూసేటప్పటికి అడగలేకపోయింది. చూస్తూ చూస్తూ తన సంసారాన్ని బయట ఎల్లా పెట్టుకొనేది? అదీగాక అన్నయ్య నవ్వతాడేమో. తను చదువుకున్నదాయె. అన్నయ్య వెక్కిరిస్తే తన డిగ్రీకే లోపం. తనే కృష్ణను ఏడిపించి, నిజాన్ని... తనకి తెలిసిన నిజాన్ని అతని చేతే బయట పెట్టిద్దామనుకుంది రాధ. వెంటనే లేచి వెళ్ళి వుత్తరం రాసేసింది.

"కృష్ణా,
నేను కులాసాగా చేరాను. హోటలుకే వెడుతున్నావా? పాపం సయించదుగా. మీ ప్రేయసుల విషయాలు ఇంట్లో టేబుల్స్‌కీ ఛైర్స్‌కీ చెబుతున్నావనుకుంటా ఏం? రాయడానికి టైముంటుందా? ఉంటే రాస్తావుగా—నీ రాధ.

తా. క. ఎప్పుడొచ్చేదీ చెప్పలేన్ను."

వెంటనే జవాబు రెక్కలు కట్టుకుని వచ్చి వాలింది.

"రాధా,
నేను ఫస్టుగావున్నాను. హోటల్లో బాగుండకేం. ఇదివరకల్లా నువ్వే వండిపెట్టావా ఏమిటి? గొప్ప నేనువస్తూన్న ఆంధ్రప్రదేశ్ కాపిటల్ లో వున్నాను. తెలుసా? నాకేం లోపంలేదు.

నా ప్రేయసుల విషయం పేటితోటీ మొర పెట్టుకోటం లేదు. రాత్రిళ్ళు కలల్నిండా వాళ్ళే ననుకో. అందుకే అలిగి వెళ్ళిపొయ్యావా? పాపం! నీ కృష్ణ.

తా. క. కమలకీ వాళ్ళకీ లెటర్లు రాశాను."

"కృష్ణా,
నీ ఉత్తరం అందింది. చాలా సంతోషం. బహుశా నే రావడం ఇంకో పదిరోజుల్దాకా పడదేమో. ఇక్కడ లలితా, లీలా వాళ్ళతో బాగా కాలక్షేపం అవుతోంది. వాళ్ళింకా

నాలుగు రోజుల్దాకా వుంటారట. అప్పటి దాకా ఫర్వాలేదు.—రాధ.

తా. క. మధుకి రావడానికి పది రోజులు దాకా వీలు కాదుట."

కృష్ణమూర్తి ఇది చదివి తెల్లబోయాడు. రాధకి మగవాళ్లు కూడా ఇంత ఇంటిమేట్ ఫ్రండ్స్ వున్నారా? మరి చెప్పలేదేం? తను లేక పోయినా చెప్తున్నాడుగా. మరి తనెందుకు చెప్ప కూడదూ. ఏమో ఆడవాళ్ళు త్వరగా బయట పడరు. మరైతే తనెందుకు రాస్తుంది ఇప్పుడు. తనకి మల్లేనే రాస్తోందేమో. ఈ ఊహ ఏ మూలో వున్నా అది నమ్మలేకపోతున్నాడు కృష్ణ.

"రాధా,

నేను కులాసాగానే వున్నాను. నాకూ కాల క్షేపం బాగానే వుంది. కమల రాలేదు గానీ శ్యామల వచ్చింది. నిన్నరాత్రి పిక్చర్‌కి వెళ్ళాం. అక్కడ్నించి టాంక్ బండ్‌కి వెళ్ళి ఇంటికొచ్చాం. మూడు అయిందనుకో. వెన్నెల కదూ. కబుర్లలో టైమ్ తెలియలా. ఇష్టం వచ్చినన్ని రోజులుండిరా.

—నీ కృష్ణ."

దీంతో అసలు సంగతి బయట పడుతుందను కున్నాడు కృష్ణమూర్తి. ఎక్స్‌ప్రెస్ డెలివరీ టైముకి రాధ చేతుల్లో పడింది. వెంటనే రిప్లయి కూడా ఇచ్చింది.

"కృష్ణా,

నేను కులాసాగానే వున్నాను. మా వాళ్లు వెళ్ళిపోయ్యారు. మధు రావడం నిన్ననే లే. కాలక్షేపం బాగుంది. ఈ రోజు రిపబ్లిక్ డే కూడాగా. మేం క్లబ్ నుంచి వచ్చేటప్పటికే నువ్వు రాసిన లెటర్ నా టేబుల్ మీద వుంది. ఇంక విశేషాలు ఏమీ లేవు. మర్చిపొయ్యా. నేనూ, మధూ కలిసి శుక్రవారం బయల్దేరి వస్తున్నాం. స్టేషన్‌కి శ్యామలతో సహా రా. ఆవిడను అడిగానని చెప్పేం? నీ రాధ."

కృష్ణమూర్తి ఇది చదివి తెల్లబోయాడు. రాధ తనని నిజంగా మోసం చేసింది. ఇంతవరకూ ఏమోలే తమాషాకి రాసిందేమో అన్న సందేహం వదిలిపోయింది. వెంటనే రాసేశాడు.

"రాధా,

నేనేదో తమాషాకన్నా కాని నాకు ఆడ వాళ్ళెవరూ ఫ్రెండ్సు లేరు. కాని నువ్వు ఒక్క మాటన్నా అనకుండా ఇల్లా చేస్తావా? ఎంత సాహసం? ఇంత మోసమా? వెంటబెట్టుకుని మరీ వచ్చి నన్ను అల్లరిపాలు చేస్తావా? నాకు కావల్సింది నీ సుఖమే. ఎక్కడున్నా సరే. అతనితోటే వుండిపో కావాలంటే. –నీకృష్ణ."

నవ్వుకుంది రాధ ఈ వుత్తరంచూసి శుక్రవారం బయల్దేరారు రాధా, మధూలు. స్టేషనుకి వచ్చిన కృష్ణను చూసి తెల్లబోయింది రాధ. అతని కళ్లు మాత్రం ఎవరికోసమో వెతుకుతున్నాయి. దిగే వాళ్లు దిగుతున్నారు. కాని మగాళ్లెవరూ దిగ లేదు రైల్లోంచి రాధ వెంట.

"ఇల్లా అయిపొయ్యావేం కృష్ణా?" అంది రాధ గాద్గదికంగా.

"మధు ఏడీ" అన్నాడు కృష్ణమూర్తి సమా ధానంగా.

నవ్వుతూ "ఇల్లారా మధూ" అంటూ పిలిచింది రాధ. రాధ ఈడుదే ఒకమ్మాయి ముందరికి వచ్చింది."

"ఇదిగో మా ఫ్రెండ్ మాధవి. మధూ అనడం అలవాటులే. ఈయన నీకు తెలుసుగా మధూ" అంటూ ఇంట్రడ్యూస్ చేసిందిరాధ.

తెల్లబోతూ "నమస్తే" అన్నాడు కృష్ణమూర్తి మాధవికి ప్రతి నమస్కారం చేస్తూ.

స్నానానికి నీళ్ళతోడుతూ "అనుమానాలు ఆడ వాళ్ళవేగదూ. ఈర్ష్యాళువు లెవరూ?" అంది రాధ రహస్యంగా.

"ష్" అన్నాడు నవ్వుతూ కృష్ణమూర్తి.

"ఇహ వుహాసుందరుల పేరెత్తవుగా"

"జన్మలో" అంటూ కాసిని నీళ్ళు మొహాన జల్లాడు కృష్ణ.

ఇంతలో...

"రాధా" అన్న కేకకు "వస్తున్నా మధూ" అని వెనక్కి తిరిగి చూసి పక్కన నవ్వింది రాధ. ఆమెనవ్వు అడుగుల చప్పుళ్లో కలిసిపోయింది. అతని నవ్వు నీటి గలగలలో కలిసిపోయింది. ★